


# అడల్ట్స్ ఓన్లీ!

## బాబూ! తప్పుకదూ?

-దోనేపూడి ప్రేమ్‌దులారి



మొదటి రాత్రి-

మల్లెపూలు, పందిరిమంచం మాటటుంచి భర్త తొమ్మిది దాటుతున్నా ఇంటికి రాకపోయే సరికి కంగారుగావుంది కన్యకి.

'ఎక్కడి కెళ్ళారు? ఈ రోజు ఇంతకన్నా రాచకార్యాలున్నాయా ఆయనకి?' కంగారుతోపాటు చిరాకు పెరిగిపోతోంది.

ఎక్కడికి వెళ్తున్నారో కనీసం చెప్పవచ్చుగా? పెళ్ళయ్యీ అవ్వకముందే తనాయనికి మొహం కొట్టేసిందా?

'బహుశా ఆయనకి తనంటే ఇష్టం లేదేమో..వాళ్ళ నాన్నగారు ఇష్టంలేని పెళ్ళి చేసారేమో..'గుండె ఝల్లుమంది కన్యకి.

అయితే ఇక తన జీవితం అడవికాచిన వెన్నెలేనా?

ఆమె బుర్ర పగిలిపోతోంది.

ఎవరికైనా తన బాధ చెప్పుకోవడానికి ఈ ఇంట్లో ఆయన తప్ప మామగారొక్కరే! అత్తగారుంటే ఆవిడకి తన బాధ చెప్పుకోగలదుగాని మామగారికి చెప్పుకోలేదుగా?

మౌనం, కన్నీళ్ళే ఇక తనకి శరణ్యం!

మామగారి గదిలో లైటారిపోయింది.

తన వునికి బహుశా కొత్తదంపతులకు ఇబ్బంది అనుకుని వుంటారు. ఈ రాత్రి ఎక్కడికి వెళ్ళగలరు? అందుకని వుండీ లేనట్లు చెయ్యడానికే తొమ్మిదింటికల్లా నిద్రకుపక్రమించి వుంటారు. పాపం పిచ్చాయన తన కొడుకు ఇంకా రోడ్లు పట్టుకునే తిరుగుతున్నాడని ఆయనకేం తెలుసు. వంటింట్లో తన ప్రక్క ప్రక్కనే తిరుగుతూ ఇబ్బంది పెడుతుంటాడని అనుకుంటూ వుండి వుంటారు బహుశ.

అయినా తనుకూడా ఎందుకింత అతిగా ఆలోచిస్తోంది? ఆయనకే అర్జంటు పనుండి ఇంకా రాలేకపోయారో? ఇంత తొందర మంచిది కాదు...

తనని తనే మందలించుకుంటూ వంటిల్లు సర్ది హాల్లో కొచ్చి సోఫాలో కూర్చుంది కన్య. ఎదురుగా వున్న ఓ వారపత్రికనందుకుని తిరగేయసాగింది.

హఠాత్తుగా ఆమె కళ్ళు ఒక పేజ్ దగ్గర ఆగిపోయాయి. అది అడల్ట్స్ ఓన్లీ కథ...ఇలాంటి కథలు ఇంతకు ముందు ఎంత ఉత్సాహంగా చదివేది. అన్నిటిలోనూ తననే నాయికగా వూహించుకుని ఆనందపడిపోయేది..తీరా జీవితంలో ఆరోజు వచ్చేసరికి..ఆ కథని చదవలేక పత్రికని పక్కన పారేసింది. తిరిగి ఆలోచనలు ఆమెని ముసరసాగాయి...

అందగాడు, ఆరడుగుల పొడవున్నవాడు-పెళ్ళి చూపుల్లో ఓరగా తలెత్తి ఆయన్ని చూడగానే మనసు ఎంత ఆనందపడిపోయింది.

ఈయన తన జీవిత భాగస్వామి ఇక కష్టమైనా, సుఖమైనా ఆయనతో తన జీవితం పంచుకోబోతోంది...ఈ అందమైన ఆలోచనలు చెదరగొడుతూ! ఇక నువ్వు లోపలకు వెళ్ళమ్మా' అన్న నాన్నగారి మాటలతో లోపలికి వచ్చేసింది. లోపలికొచ్చినా మనసక్కడే వుంది. తలుపు ప్రక్కనే నిల్చుని వాళ్ళ మాటల్ని వినసాగింది.


"ఏరా! అమ్మాయి ఎలావుంది?" కాబోయే మామగారడిగారు.

ఆయన జవాబియ్యలేదు.

"నాకు మాత్రం బాగా నచ్చింది. తల్లికూడా లేని పిల్ల మనమే బాగా చూసుకోవాలి" మళ్ళీ మామగారే అన్నారు. ఎంతటి గొప్ప వ్యక్తిత్వం మురిసిపోయింది తను.

"మీ ఇష్టమే నా ఇష్టం..." తల వంచుకునే అన్నాడాయన.

తన ఆనందానికి పట్టపగ్గాల్లేవు.




నెలరోజులు తిరక్కుండానే పెళ్ళయిపోవడం, కాపురానికి వచ్చేయడం జరిగిపోయింది. తనెంత అదృష్టవంతురాలు అని మురిసిపోతోందింతవరకు. కానీ తను దురదృష్టవంతురాలేమో? ఆరోజు ఆయన మౌనం పెద్దలమీద గౌరవం కాదు- తన పెళ్ళిమీద విరక్తేమో?

ఏమో...అయినా కావచ్చు...అందుకే ఇక్కడికి వచ్చినప్పటి నుంచి తనని తప్పించుకు తిరుగుతున్నారు. రాత్రి ఎప్పుడు పడుతుందాని ఎదురు చూడాల్సింది పోయి రాత్రి పడగానే ఏదో పనున్నట్లు చరా చరా వెళ్ళిపోయారు. పదవుతూన్నా ఇంటికి చేరలేదు. పడుకోవాలనిపించి వెనక్కివాలి కళ్ళు మూసుకుంది కన్య-నిద్ర వచ్చికాదు, బాధతో.

లైటు వేసిన శబ్దం కావడంతో వులిక్కిపడి లేచింది కన్య.

మామగారి గదిలో లైటు వెలిగింది. ఆయనా గమనిస్తున్నారేమో...

సిగ్గేసింది కన్యకి....నెమ్మదిగా లేచింది.

మామగారి గదిలో లైటారిపోయింది.

గుమ్మం దాకా వెళ్ళి బయట అటు, ఇటు చూసింది. ఎక్కడా భర్త వస్తున్న జాడ లేదు. అయిష్టంగానే లోపలికొచ్చి గడియపెట్టి సరాసరి తన గదిలోకి వచ్చి మంచం మీద పడిపోయింది కన్య. అంతవరకూ బలవంతాన ఆపుకుంటున్న కన్నీళ్ళు వరదలా పొంగుకొచ్చాయి. దిండులో తలదూర్చుకోవడానికి దాన్నివతలికి లాగింది. క్రిందనున్న కాగితం ఇవతలికొచ్చింది.

ఏదో ఉత్తరం!

వణుకుతున్న చేతులతో దాన్నందుకుంది.

నిన్నేమని సంబోధించాలో నాకర్థం కావడం లేదు.

అందం, పర్సనాలిటీ, ఉద్యోగం వున్నా నాలో అసలు మగవాడి కుండాల్సిన లక్షణం లేదు. యవ్వనం వచ్చిన తర్వాత ఈ విషయం తెలిసి షాక్ తిన్నాను. ఎంతోమంది డాక్టర్ల దగ్గరకు వెళ్లాను. ఎన్నో మందులు తిన్నాను..ఫలితం శూన్యం.

ఎన్నాళ్ళని పెళ్ళి చేసుకోకుండా వుండగలను? ఎంతోమంది వాళ్ళమ్మాయిల్ని చేసుకొమ్మని వత్తిళ్ళు చెయ్యసాగారు. ఇక విధిలేక నాన్నగారికి ఈ విషయం చెప్పాను. ఆయనా షాక్ తిన్నారు...

రెండు మూడు రోజులాలోచించి ఒక నిర్ణయానికొచ్చారు.

"నీ కోసమేరా, నీ భవిష్యత్తు బావుండాలనే మీ అమ్మ చనిపోయినా నేను మరో పెళ్ళి చేసుకోలేదు...నీలో ఈ లోపం తెలిసి నలుగురు నిన్ను వేలెత్తి చూపుతుంటే నేను భరించలేనురా.." అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు. నేనూ ఆయన దగ్గర చిన్నపిల్లాడిలా ఏడ్చాను.

మరో రెండు, మూడు రోజులు మా ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది.

ఒకరోజు నాన్నగారు పిలిచి, చెప్పలేక చెప్పలేక చెప్పారు... "ఇంతకన్నా ఈ ఇల్లు పరువు నిలపడానికి మరోమార్గం కనిపించడం లేదురా...." అన్నారు బాధగా.

ఆయన మాటలు నా హృదయాన్ని ముక్కలు ముక్కలుగా కోసినా అంతకన్నా వేరే మార్గం నాకూ కనిపించలేదు.

నేనూ అంగీకరించాను.

పెళ్ళి నేను చేసుకున్నాను. నీ పిల్లలు నా పిల్లలు. కానీ నువ్వు సంసారం చెయ్యాల్సింది నాతోకాదు-నాన్నగారితో....

ఇక చదవలేకపోయింది కన్య.

ఏడ్వడం కూడా మరచిపోయి అలా శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. ఆ గదిలోకి మామగారు అడుగుపెట్టి లైటు తీసేసినా ఆమె స్పృహలోకి రాలేదు...మామ గారి చెయ్యి ఆమె మీద పడగానే వెనక్కిపడిపోయింది.

కంగారుపడ్డ మామగారు డాక్టర్కి ఫోన్ చేసారు.

మర్నాడుదయం ఎప్పటికో ఆమె స్పృహలోకి వచ్చింది.

ఆలోచన్లు..ఆలోచన్లు...అంతులేని ఆలోచన్లు...బుర్రపగిలే ఆలోచన్లు..స్పృహలోకి వచ్చినా కళ్ళు తెరవబుద్ధికావడం లేదు.

వున్నదంతా వూడ్చి పెళ్ళిచేసి బాధ్యతలు దింపుకున్నట్లు తృప్తిగా వున్న తండ్రి ఒక ప్రక్క...అందం, ఆకర్షణ అన్నీ వుండి భార్యని అడగకూడని మాటడిగిన భర్త అందవికారంగా, రాక్షసుడుగా కనిపిస్తున్నాడు మరో ప్రక్క..అతడి బారి నుంచి కాపాడుకోవాలంటే నాన్నదగ్గరకి కాదు పరుగెత్తుకు రావలసింది. అలా వస్తే ఆయన కుప్పకూలిపోతాడు. మరి, ఎక్కడకు వెళ్ళాలి?

చేతులు చాచి ఆహ్వానిస్తూ మామ కనిపించాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆయన చేతుల్లో వాలిపోయింది.

ఒక స్థిర నిశ్చయానికొచ్చినట్లు కళ్ళు తెరిచింది కన్య. దూరంగా నించుని తననే గమనిస్తున్నారు మామగారు. ఆయన కళ్ళలో బాధ, తప్పుచేసిన గిల్టీనెస్...చూపు ఇవతలికి మరల్చింది. భర్త!

అతడి ముఖంలో ఎటువంటి భావం కనిపించడం లేదు.

"కన్యా!ప్లీజ్ కాసిని పాలు తాగవూ.." కన్యని ఎడమచేతితో పైకెత్తుతూ పాలగ్లాసుని కుడి చేతితో ఆమె నోటి కందించబోయాడు.

"తప్పు బాబూ..నేను నీ అమ్మని ఆయనకివ్వు ఆ గ్లాసు. ఆయన తాగిస్తారు.." అసంకల్పితంగా ఆమె నోటి నుంచి ఆ మాటలు వచ్చేసరికి భర్తనే ఆ బడుద్ధాయి చేతిలోంచి పాలగ్లాసు జారి కిందపడింది. అక్కడ వుండలేక అవతలకి వెళ్ళిపోయాడు.

ఆమె చూపుల్లో కనిపిస్తున్నది ప్రేమో, దైన్యమో, నిర్లక్ష్యమో, నిరాసక్తతో అర్థంకాక అయోమయంగా ఆమెనే చూస్తూ నిల్చుండిపోయాడా మామగారు.

★

## A జోక్స్

### టైమ్

లాడ్జింగ్లో ఓ జంటను రెడ్హాండెడ్గా పట్టుకున్నాడు ఇన్స్పెక్టర్.

"నడవండి స్టేషన్కు" అన్నాడు ఇన్స్పెక్టర్.

"అలాగేసార్. కానీ మేం వచ్చింది ఇప్పుడే. ఒక్క పదినిముషాలు టైమివ్వండి!" చెప్పాడు అతడు.

-శ్రీనివాస్ వల్లాల (విఠలాపురం)

### అలాగే

ఆనందరావు సాయంకాలం వేళ డాబాపైన కుర్చీలో కూర్చొని ఉన్నాడు. అంతలో వర్షం తుంపర్లు పడసాగాయి. డాబాపై దండేనికి కట్టిన బట్టలు తీయడానికి అతని మరదలు వచ్చింది. మరదల్ని చూడగానే ఆనందరావు కొంటెగా "మరదలూ! నీ చీరవిప్పడం పూర్తికాగానే నాలుంగీ కూడా తీసెయ్" అన్నాడు.

"అలాగే బావగారూ! కానీ నాచీర విప్పేలోగా మీ లుంగీ తడిసిపోకుండా ఉండాలిగా.." చురక అంటించింది మరదలు.

-గుత్తుల శ్రీనివాసురావు (దొంతికుర్రు)